శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణం

కథలాపూర్, మే 30 : మండల కేంద్రంలో శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామివారిని ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చి, ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై స్వామివారి కల్యాణం జరిపించారు. ఇక్కడ ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చెన్నమనేని వికాస్‌రావు, నాయకులు, ఆలయకమిటీ సభ్యులున్నారు.

రేపటి లోగా రిపోర్ట్ చేయాలి

మల్యాల, మే 30 : తెలంగాణ రాష్ట్ర గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్‌లో ఇప్పటివరకు రెండో విడుతలో సీటు పొందిన విద్యార్థులు జూన్ 1 లోపు రిపోర్ట్ చేయాలని గురుకుల పాఠశాల కన్వీనర్ పత్తెం శ్రీనివాస్ తెలిపారు. సీటు పొందిన విద్యార్థులకు ఇప్పటికే సంక్షిప్త సందేశం రూపంలో సమాచారం చేరిందని, అయినప్పటికినీ ఇంకా రిపోర్ట్ చేయని వారు ఉంటే సంబంధిత ప్రిన్సిపాల్‌కు రిపోర్ట్ చేయాలని సూచించారు. సిరిసిల్ల జిల్లాలోని నేరెళ్ల బాలికల పాఠశాల, జగిత్యాల జిల్లాలోని పెద్దాపూర్ బాలుర, తాటిపల్లిలోని బాలికల, పెద్దపల్లి జిల్లాలోని మేడారంలోని బాలుర పాఠశాలలో సీటు పొందిన వారు వెంటనే రిపోర్ట్ చేయాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

మల్యాల, మే 30 : మల్యాల మండలం తాటిపల్లి, మెట్‌పల్లి మండలం పెద్దాపూర్‌లోని రాష్ట్ర గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలో అతిథి లెక్చరర్ పోస్టులతోపాటూ అతిథి ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలు ఉన్నట్లు పాఠశాల కన్వీనర్ పత్తెం శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు principal.tsrs.thatipally@gmail.com మెయిల్ చేయాలన్నారు. దరఖాస్తులు జూన్ 6వ తేదీలోపే అందేలా పంపాలన్నారు. షార్ట్‌లిస్ట్ క్యాండిడేట్స్‌కు డెమో క్లాసుల ఆధారంగా ఎంపిక చేస్తామని శ్రీనివాస్ తెలిపారు.

బెదిరింపులపై డీఎస్పీకి ఫిర్యాదు

మెట్‌పల్లి, మే 30 : పట్టణంలోని 12వ వార్డు కౌన్సిలర్ భర్త, కాంగ్రెస్ నాయకుడు ఎండీ శాఖీర్ సిద్ధిఖీ తనను చంపుతానని బెదిరిస్తున్నాడని అదే వార్డు పరిధిలోని అర్బన్ హౌసింగ్ కాలనీకి చెందిన ఖాజా మొహినొద్దీన్ (65) గురువారం డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావును కలిసి ఫిర్యాదు చేశాడు. తనను, తన కొడుకును చంపుతానని బెదిరిస్తున్నాడని, అతని వల్ల తనకు ప్రాణభయం ఉందంటూ ఆ వృద్ధుడు డీఎస్పీకి విన్నవించాడు. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకుని న్యాయం చేస్తామని డీఎస్పీ హామీ ఇచ్చినట్లు బాధితుడు విలేకరులతో తెలిపాడు.

విత్తన దుకాణాల్లో తనిఖీలు

వెల్గటూర్, మే 30 : వెల్గటూర్, ఎండపల్లి ఎరువుల దుకాణాల్లో వ్యవసాయాధికారి కరుణ, ఎస్ఐ ఉమాసాగర్ తనిఖీలు చేసి రికార్డులను పరిశీలించారు. కరుణ మాట్లాడుతూ రైతులు విత్తనాలు, ఎరువులు, కొనుగోలు సమయంలో రసీదు తీసుకోవాలని సూచించారు. లూజు విత్తనాలు, బీటీ 3 విత్తనాలు కొనుగోలు చేయవద్దన్నారు. ఏదైనా సమస్యలు ఎదురైతే వ్యవసాయ శాఖాధికారులను సంప్రదించాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. ఇక్కడ వ్యవసాయ శాఖ సిబ్బంది ఉన్నారు.

విద్యార్థుల కోసం స్పెషల్ డ్రైవ్

సారంగాపూర్, మే 30 : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు అధ్యాపకులు గురువారం గ్రామాల్లో తిరుగుతూ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. జిల్లా నోడల్ అధికారి నారాయణ ఆదేశాలు మేరకు అధ్యాపకులు రేచపల్లిలో పదో తరగతి పూర్తిచేసిన విద్యార్థుల ఇండ్లకు వెళ్లి పేర్లు నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు సుజాత, సౌజన్య, నాగేశ్వరి, రజిత, రాజు, రాజేందర్, వెంకటేశ్వర్లు, రాజ్‌కుమార్, సతీశ్ పాల్గొన్నారు.

పూడికతీత పనులు చేపట్టాలి

పెగడపల్లి , మే 30: కీచులాటపల్లిలోని ఎస్సారెస్పీ కాలువలతోపాటు, చెరువు ఫీల్డర్ ఛానల్‌లో పూడికతీత పనులు చేపట్టాలని కోరుతూ గ్రామ రైతులు గురువారం ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డికి విన్నవించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవోను రైతులు కలిసి వివరించారు. వారం రోజుల్లో ఉపాధి హామీ పథకంలో పూడికతీత పనులు చేపడతామని ఎంపీడీవో రైతులకు హామీ ఇచ్చారు. ఇక్కడ ఎంపీటీసీ కొత్తపల్లి రవీందర్, ఈజీఎస్ ఏపీవో అనిల్, టీఏ నాని, రైతులున్నారు.

గుట్కా అక్రమ రవాణాపై కఠినంగా వ్యవహరించాలి

జగిత్యాల, మే 30 : యువత చెడిపోవడానికి కారణమవుతున్న గంజాయి, గుట్కా రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి కలెక్టర్‌ను కోరారు. ఈవిషయమై గురువారం కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషాకు లేఖ రాశారు. మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే దుష్పరిణామాలపై ప్రసార మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలని కలెక్టర్ యాస్మిన్ బాషాను కోరారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మెట్‌పల్లి రూరల్, మే 30 : ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న ట్రాక్టర్లను మెట్‌పల్లి పోలీసులు పట్టుకున్నారు. గురువారం ఎలాంటి అనుమతులు లేకుండా మల్లాపూర్ నుంచి మెట్‌పల్లి పట్టణానికి అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా వేంపేట శివారులో మూడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు. పట్టుబడిన ట్రాక్టర్లను ఠాణాకు తరలించి, కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

కోలాటం ఆడుతున్న మహిళలు

ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, వేద పండితులు

కొండగట్టులో ఉత్సవాలు షురూ

- ఘనంగా ప్రారంభమైన హన్మాన్ పెద్ద జయంతి వేడుకలు
- ఆంజనేయుడికి భద్రాద్రి రామయ్య పట్టు వస్త్రాలు
- తరలివస్తున్న దీక్షాపరులు, భక్తులు

మల్యాల, మే 30 : ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో హన్మాన్ పెద్ద జయంత్యుత్సవాలను ఆలయ అర్చకులు, వేద పండితులు గురువారం ఘనంగా ప్రారంభించారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా, బుధవారం అర్చకులు శాస్త్రోక్తంగా ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. తొలిరోజు ఆంజనేయ స్వామి మూల విరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భద్రాచలం శ్రీ సీతారాచంద్రస్వామి దేవస్థానం వారు ఆంజనేయ స్వామికి అందజేసిన నూతన పట్టువస్త్రాలతోపాటు, పోచంపల్లి చేనేత పట్టు వస్త్రాలను భద్రాచలం ఈవో రమాదేవి, ఉత్సవ ప్రత్యేకాధికారి వినోద్‌రెడ్డి, ఈవో ఆకునూరి చంద్రశేఖర్ స్వామివారి చెంతకు తీసుకురాగా, ఆంజనేయస్వామి వారిని నూతన పట్టువస్త్రాలతో అలంకరించారు. ఆలయ సాంస్కృతిక ఇన్‌చార్జి శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో కళాకారుల బృందం ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కొండగట్టు వై జంక్షన్ నుంచి ఆలయం వరకు డప్పు చప్పుళ్లు, కోలాటాలు, ఒగ్గుడోలు విన్యాసాలు, శివసత్తుల పూనకాల నడుమ ఆట పాటలతో భద్రాద్రి ఆలయ పట్టువస్త్రాలను ఎదుర్కొన్నారు. మల్లయ్య బృందం 108 దీపాల ప్రదర్శన, రాజేశ్ కళాబృందం పోతురాజులతో దీపాల ప్రదర్శన, గడ్డం వెంకటయ్య బృందం యక్షగానం, గడ్డం వెంకటరాజం బృందం ఆధ్వర్యంలో చిందు కళాకారులు పలు వేషధారణలతో అలరించారు. కచ్చు అంజయ్య ఆధ్వర్యంలో ఒగ్గు డోలు బృందం డోలుతో విన్యాసాలు ప్రదర్శించారు. చిరంజీవి, లక్ష్మి, రమేశ్, వనజ, సీతారామ కళా బృందం, రాణి, శారద కళా బృందాల ఆధ్వర్యంలో కోళాటాల బృందం కోళాటాలతో కదం తొక్కారు. డప్పు కళాకారుల సంజీవ్ నేతృత్వంలో ప్రదర్శనను నిర్వహించారు.

స్వామి వారి మూల విరాట్‌కు ప్రత్యేక పూజల అనంతరం స్వామి ఉత్సవ మూర్తులను పల్లకీపై ప్రతిష్ఠించి వారికి స్వస్తి వాచనం, రక్షాబంధనం, రుత్విక్ వరణం, అరుణిమథనం వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేద పండితుల వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాలతో పల్లకీ ద్వారా ఉత్సవ మూర్తులను యాగశాల ప్రవేశం చేశారు. ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై ప్రతిష్ఠించారు. సాయంత్రం వాహన పూజా స్థలం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై కళాకారులు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. భద్రాచలం దేవస్థానం నుంచి పట్టువస్త్రాలను కొండగట్టు ఆలయానికి తీసుకువచ్చిన భద్రాద్రి ఆలయ ఈవో రమాదేవితోపాటు ఆలయ సిబ్బందికి కొండగట్టు దేవస్థాన అర్చకులు ఆంజనేయ స్వామిని దర్శింపచేయగా, ఆలయ ఈవో చంద్రశేఖర్, ఏఈవో అంజయ్య, అర్చకులు సన్మానించి తీర్థప్రసాదాలను అందజేశారు. ఇక్కడ స్థానాచార్యులు కపీందర్, ప్రధానార్చకులు రామకృష్ణ, జితేంద్రప్రసాద్, రఘు, ఉప ప్రధానార్చకులు చిరంజీవి, రాము, పర్యవేక్షకులు సునీల్, వేదపండితులు రాజేశ్వర్‌రావు, పెద్దన్నశర్మ పాల్గొన్నారు.

తరలివస్తున్న ఆంజనేయ స్వామి దీక్షాపరులు

పెద్దజయంతి సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి ఆంజనేయ స్వామి దీక్షాపరులు కొండగట్టు ఆలయానికి తరలివస్తున్నారు. సూర్యాస్తమయం తర్వాత కాషాయధారుల రాక ప్రారంభమైంది. భక్తులు కొండగుట్టు గుట్ట కింది నుంచి ఘాట్ రోడ్డు, పురాతన మెట్ల దారి ద్వారా కాలినడకన ఆలయానికి చేరుకుంటున్నారు. ఉత్సవాల తొలి రోజుననే మాల విరమణ మండపాన్ని తెరిచారు. ఉదయం నుంచే అర్చకులు దీక్షావిరమణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

మాట్లాడుతున్న ఎంపీపీ మారు సాయిరెడ్డి

కల్వకుంట్లపై ఆరోపణలు సరికాదు

- ఎంపీపీ మారు సాయిరెడ్డి

మెట్‌పల్లి, మే 30 : కోరుట్ల మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌పై ఆరోపణలు చేయడం సరికాదని మెట్‌పల్లి ఎంపీపీ మారు సాయిరెడ్డి అన్నారు. గురువారం మెట్‌పల్లి పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కోరుట్ల నియోజకవర్గ ప్రజలు విద్యాసాగర్‌రావును నాలుగు సార్లు, తనయుడు డాక్టర్ సంజయ్‌ను ఎమ్మెల్యేగా గెలిపించారని, ఈ కుటుంబానికి ప్రజల్లో ఉన్న ఆదరణను చూసి ఓర్వలేక కాంగ్రెస్ నాయకులు కొందరు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. అవినీతి ఆరోపణలను నిరూపించాలని లేని పక్షంలో ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్‌పై పెద్ద నాయకులను విమర్శించినంత మాత్రన పెద్దవారు కాలేరని, ఆడలేక మద్దెల ఓడు అన్నట్లుగా ఎన్నికల్లో మూడో స్థానంలో నిలిచిన అభ్యర్థి తాను ఫోన్ ట్యాపింగ్ వల్లే ఓడిపోయానని బిల్డప్ ఇచ్చుకోవడం, అడ్డగోలుగా ఆరోపణలు చేయడం ఎంత మాత్రం సబబు కాదన్నారు. కోరుట్లలో జరిగిన అభివృద్ధి కాంగ్రెస్ నాయకులకు కనిపించకపోవడం విచారకరమన్నారు. ప్రజల మద్దతుతో వరుసగా ఐదుసార్లు విజయం సాధించిన కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, డాక్టర్ సంజయ్‌పై ఆరోపణలు చేస్తే ప్రజలు సహించరని, తగిన బుద్ధిచెబుతారని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో నాయకులు దారిశెట్టి రాజేశ్, తిరుపతిరెడ్డి, కిశోర్, ఆకుల ప్రవీన్, తేజ, వెంకటేశ్, ప్రణయ్‌గౌడ్, శ్యామ్, సతీశ్, తదితరులున్నారు.

పెట్రోల్‌కు బదులు నీళ్లు

- మల్లాపూర్‌లో ఓ ద్విచక్రవాహనదారుడి అందోళన
- తహసీల్దార్‌కు ఫిర్యాదు

మల్లాపూర్, మే 30 : మల్లాపూర్ మండల కేంద్రంలోని ఓ పెట్రోల్ బంక్‌లో పెట్రోల్‌కు బదులు నీళ్లు పోయడంతో ద్విచక్రవాహనదారుడు మల్లాపూర్‌కు చెందిన ముత్యాల గంగరాజం నివ్వెరపోయాడు. ఆయన వివరాల మేరకు.. గురువారం స్థానిక బంక్‌కు వెళ్లి తన బైక్‌లో ₹110 పెట్రోల్‌ను పోసుకున్నాడు. తర్వాత కొద్ది దూరం వెళ్లగానే బైక్ ఆగిపోయింది. దీంతో ఓ మెకానిక్ దగ్గరికి వెళ్లి బైక్‌ను చూపించాడు. మెకానిక్ ట్యాంక్‌ను విప్పి చూసి, అందులో ఉన్న పెట్రోల్‌ను తీసి పరిశీలించాడు. వచ్చిన పెట్రోల్ నీళ్ల మాదిరిగా కనిపించడంతో గంగరాజం అవాక్కయ్యాడు. వెంటనే సంబంధిత పెట్రోల్ బంక్ వద్దకు వెళ్లి ఆందోళన చేశాడు. తర్వాత బంక్‌పై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ వీర్‌సింగ్‌కు ఫిర్యాదు చేశాడు.

పెట్రోల్ పంపు వద్ద పెట్రోల్‌కు బదులు నీళ్లు వచ్చిన బాటిల్‌ను చూపుతున్న గంగరాజం

వాహనంలో నీళ్లను ఓ బాటిల్‌లో తీస్తున్న బాధితుడు ముత్యాల గంగరాజం

రైతు ఉత్పత్తిదారుల సంఘాన్ని సందర్శించిన అధికారులు

జగిత్యాల రూరల్, మే30: జగిత్యాల రూరల్ మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో క్రిభ్ కో సంస్థ అధికారులు రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘాన్ని గురువారం సందర్శించారు. లక్ష్మీపూర్ రైతు ఉత్పత్తిదారుల కంపెనీ నూతన గోదాం, నూతన భవనం వివిధ అభివృద్ధి కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ఎల్లవేళలా ఎరువులు అందుబాటులో ఉండడానికి గ్రామానికి అదనపు ఎరువుల గోదాంను మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో ఉత్పత్తిదారుల కంపెనీ చైర్మన్ పన్నాల తిరుపతి రెడ్డి, వైస్ చైర్మన్ గర్వందుల గంగయ్య, డైరెక్టర్లు మోహన్ రెడ్డి, తిరుపతి రెడ్డి, రాజిరెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, లక్ష్మారెడ్డి, రాజిరెడ్డి, బుచ్చిరెడ్డి, కుమార్, మనోహర్‌రెడ్డి, పోచయ్య, జయంత్, తిరుపతిరెడ్డి, ప్రేమ్‌తేజా క్రిభ్‌కో మేనేజర్, సీఈవోస్, రైతులు పాల్గొన్నారు.

గ్రూప్-1 ప్రిలిమ్స్‌ను పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ యాస్మిన్ బాషా

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాల, మే 30 : టీఎస్‌పీఎస్సీ గ్రూప్-1 ప్రిలిమ్స్‌ను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో కోర్ గ్రూప్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రూప్ 1 ప్రిలిమ్స్‌ను నిబంధనల ప్రకారం నిర్వహించాలని పేర్కొన్నారు. పరీక్ష నిర్వహణకు 22 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 22 మంది పరిశీలకులు, 22 మంది డిపార్టుమెంటల్ అధికారులు, నలుగురు రూట్ అధికారులు, నలుగురు సహాయ రూట్ అధికారులు, నలుగురు ఫ్లయింగ్ స్క్వాడ్స్, 157 మంది ఐడెంటిఫికేషన్ అధికారులను నియమించినట్లు తెలిపారు. జిల్లాలోని 22 పరీక్షా కేంద్రాల్లో జగిత్యాలలో 18, జేఎన్‌టీయూలో ఒకటి, కోరుట్లలో 3 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షకు 7,692 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని చెప్పారు. పరీక్షకు నోడల్ అధికారిగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దివాకరను నియమించినట్లు తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేయాలని డిపో మేనేజర్‌ను ఆదేశించారు. పరీక్ష సమయానికి గంట ముందే అభ్యర్థులు వారి కేంద్రానికి చేరుకోవాలని తెలిపారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దివాకర, రీజినల్ కో ఆర్డినేటర్ వేణుగోపాల్, ఆర్డీవోలు మధుసూదన్, ఆనంద్ కుమార్, డీఎస్పీ రవీందర్, డీఎంహెచ్‌వో శ్రీధర్, డిపో మేనేజర్ సునీత పాల్గొన్నారు.

నాణ్యతతో పనులు చేపట్టాలి

జగిత్యాల, మే 30 : అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమం కింద చేపడుతున్న పనులను నాణ్యతతో చేపట్టాలని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అన్నారు. గురువారం సాయంత్రం జగిత్యాలలోని విద్యానగర్, వీక్లీ బజార్, చిలుకవాడల్లోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పనులను నాణ్యతతో, వేగంగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఈఈ రహమాన్, హౌసింగ్ డిప్యూటీ ఈఈ రాజేశ్వర్, జిల్లా విద్యాశాఖాధికారి జగన్ మోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సారంగాపూర్, మే 30 : అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దివాకర్ అన్నారు. మండలంలోని నగునూర్, లచ్చక్కపేట, బీర్‌పూర్ మండలంలోని నర్సింహులపల్లి, కొల్వాయి గ్రామాల్లో గురువారం పర్యటించి అమ్మ ఆదర్శ పాఠశాలల ప్రగతిని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఆయా మండలంలో గుర్తించిన పాఠశాలల్లో నిర్మాణ పనులు ఈనెల 31 వరకు పూర్తి చేయాలని ఆదేశించారు. ఇక్కడ పంచాయతీ రాజ్ ఈఈ రెహమాన్, డిప్యూటీ ఈఈ మిలింద్, ఎంపీడీవో లచ్చాలు, ఎంపీవో శశికుమార్, ఏఈ భూపతి, కార్యదర్శులు, ప్రదానోపాధ్యాయులు ఉన్నారు.

అందుబాటులోకి సరిపడా విత్తనాలు

జగిత్యాల టౌన్, మే 30 : వానాకాలం సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు సరిపడా జీలుగ, జనుము, పత్తి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయ అధికారి వాణి తెలిపారు. గురువారం వ్యవసాయ శాఖ డైరెక్టర్, జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషలతో కలిసి విత్తనాల లభ్యత, సరఫరా గురించి టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా డీఏఓ వాణి మాట్లాడుతూ ఈ వానాకాలం సీజన్‌కు అవసరమైన పచ్చిరొట్ట, జీలుగ విత్తనాలు 14,300 క్వింటాళ్ళు జిల్లాకు కేటాయించినట్లు పేర్కొన్నారు. రైతులు జీలుగను జూన్ మాసం రెండవ వారం వరకు విత్తుకోవచ్చని సూచించారు.

బైక్‌ను ఢీకొన్న ట్రాక్టర్

- ఒకరి దుర్మరణం
- కిషన్‌రావుపేట బస్‌స్టేజీ వద్ద ప్రమాదం
- మృతుడిది ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి

వెల్గటూర్, మే 30: బైక్‌ను వెనుక నుంచి ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. మండలంలోని వెల్గటూర్ బస్‌స్టేజీ వద్ద బుధవారం రాత్రి ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెళ్లికి చెందిన బావునే దత్త(26) అదే గ్రామానికి చెందిన బింబి వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం రాత్రి దత్త తన యాజమాని బింబి కొడుకు కోటేశ్‌ను కరీంనగర్ వెళ్లేందుకు ఊట్నూర్‌లో బస్సు ఎక్కించాడు. అంతలోనే తన కొడుకును తిరిగి ఇంటికి తీసుకురావాలని బింబి, దత్తకు ఫోన్ చేసి చెప్పాడు. దీంతో ఆయన బైక్‌పై బస్సును పాలోఅవుతూ వెళ్తున్నాడు. వెల్గటూర్ మండలం కిషన్‌రావుపేట బస్‌స్టేజీ సమీపంలో కరీంనగర్ వైపు నుంచి వస్తున్న ట్రాక్టర్ దత్తు బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దత్తు తలకు బలమైన గాయాలు తగిలి అక్కడికక్కడే మరణించాడు. మృతుడి బావ కృతికార్ అశోక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆర్.ఉమాసాగర్ తెలిపారు.

అ'పూర్వ' సమ్మేళనాలు

మేడిపల్లి: భీమారంలో ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

మల్లాపూర్ : మల్లాపూర్ పాఠశాలలో పూర్వ విద్యార్థులు

మేడిపల్లి, మే 30 : భీమారం మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్‌లో 2003-04 విద్యా సంవత్సరం 10వ తరగతి పూర్వ విద్యార్థులు, ఆనాటి ఉపాధ్యాయులు 20 సంవత్సరాలకు గురువారం ఆత్మీయ సమ్మేళనంలో కలిశారు. ఆనాటి మధుర స్మృతులను జ్ఞాపకం చేసుకున్నారు. ఆట, పాటలతో ఆనందంగా గడిపారు. ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాజు, ఉపాధ్యాయులు లింగారెడ్డి, వెంకటేశ్వర్లు, రవీందర్, శ్యాం, పూర్వ విద్యార్థులున్నారు.

మల్లాపూర్, మే 30 : మండల కేంద్రంలో జడ్పీ హెచ్ఎస్‌లో 2006-07లో పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆనాటి తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. గురువులను సన్మానించారు. రోజంతా ఉత్సాహంగా గడిపారు.

భక్తులతో మర్యాదగా మెలగాలి

సమావేశంలో మాట్లాడుతున్న జగిత్యాల డీఎస్పీ రఘుచందర్

మల్యాల (కొడిమ్యాల), మే 30 : కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి సన్నిధానానికి వచ్చే భక్తులతో మర్యాదగా మెలగాలని డీఎస్పీ రఘుచందర్ సూచించారు. హనుమాన్ పెద్ద జయంతి నేపథ్యంలో నాచుపల్లి జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన పోలీస్ సిబ్బందికి సూచనలు చేశారు. సిబ్బందికి డ్యూటీలు అలాట్ చేయడంతో పాటు ఏమైనా ఇబ్బందులు తలెత్తితే స్థానిక సీఐ నీలం రవి, ఎస్ఐలు రహీం, కుమారస్వామికి సమాచేరం చేరవేయాలని తెలిపారు. ఇక్కడ మల్యాల సీఐ నీలం రవి, సిబ్బంది ఉన్నారు.

బాధితుడికి మాజీ మంత్రి పరామర్శ

వెల్గటూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏలేటి కృష్ణారెడ్డిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

వెల్గటూర్, మే 30 : ఎండపల్లి మండలంలోని మారేడుపల్లి గ్రామానికి చెందిన తనుగుల రామయ్య రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, గురువారం బాధిత కుటుంబాన్ని రాష్ట్ర మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం కరీంనగర్‌లో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న వెల్గటూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏలేటి కృష్ణారెడ్డిని పరామర్శించారు. వీరి వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సింహాచలం జగన్, నాయకులు గందం లక్ష్మీనారాయణ, సంజీవ్, కనుకయ్య, రాజేశ్ తదితరులున్నారు.

చట్టాలపై అవగాహనకు సదస్సులు

నేరెళ్లలో మాట్లాడుతున్న ధర్మపురి కోర్టు న్యాయమూర్తి శ్యాంప్రసాద్

ధర్మపురి, మే 30 : చట్టాలపై ప్రజలకు అవగాహన పెంపొందించడానికి న్యాయ విజ్ఞాన సదస్సులు ఎంతో ఉపయోగపడతాయని ధర్మపురి కోర్టు న్యాయమూర్తి శ్యాంప్రసాద్ అన్నారు. గురువారం నేరెళ్లలో చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీనికి అథితిగా శ్యాంప్రసాద్ హాజరై మాట్లాడుతూ, చట్టాలపై గ్రామీణ ప్రజలకు అవగాహన ద్వారా ఏండ్ల కొద్దీ పెండింగ్‌లో ఉన్న కేసులు సత్వరమే పరిష్కారం అయ్యేందుకు దోహదపడుతుందన్నారు. ప్రజలు కోర్టుల చుట్టు తిరగ కుండా రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ బీ రాజేశ్, ఎస్ఐ ఉదయ్‌కుమార్, బార్ అధ్యక్షుడు రౌతు రాజేశ్, ఉపాధ్యక్షుడు రామడుగు రాజేశ్, కార్యదర్శి బందెల రమేశ్, న్యాయవాదులు జాజాల రమేశ్, శ్రీకాంత్ ఎంపీటీసీ సత్యం, మాజీ సర్పంచ్ పలిగిరి సత్యం, కార్యదర్శి మల్లారెడ్డి పాల్గొన్నారు.

పుస్తకాల ఆవిష్కరణ

మెట్‌పల్లి, మే 30 : వయోవృద్ధుల సంరక్షణ చట్టం అవగాహన పుస్తకాలను గురువారం మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్ సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ, వయోవృద్ధులైన తల్లిదండ్రుల సంరక్షణ, భద్రతను కల్పించాల్సిన బాధ్యత పిల్లలదేనని, తల్లి దండ్రులను విస్మరించేవారు చట్టపరంగా శిక్షర్హులవుతారని పేర్కొన్నారు. వయోవృద్ధుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న సీనియర్ సిటిజన్లు జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు ఒజ్జెల బుచ్చిరెడ్డి, కార్యదర్శి సౌడ